## 8 మంది సీఐల బదిలీ.. ఉత్తర్వులు జారీ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి): మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఇవ్వాల (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిసిఎస్‌లో పనిచేస్తున్న రామకృష్ణ ను ఖమ్మం టాస్క్ ఫోర్స్ కు, ఖమ్మం టాస్ఫోర్స్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, ఆసిఫాబాద్ డిఎస్బి లో పనిచేస్తున్న రమేష్ ను జమ్మికుంట టౌన్‌కు, జమ్మికుంటలో పనిచేస్తున్న రామచందర్ రావును జగిత్యాల టౌన్ కు, జగిత్యాల టౌన్ లో పనిచేస్తున్న కిషోర్ మల్టీ జోన్ వన్ కార్యాలయానికి, నిజామాబాద్ సిసిఎస్‌లో పనిచేస్తున్న వెంకటేష్ను ఆదిలాబాద్ రూరల్‌కు, ఆదిలాబాద్ రూరల్ లో పని చేస్తున్న రఘుపతిని మల్టీజోన్ వన్ కార్యాలయానికి, ఖమ్మం సిఎస్బి లో పనిచేస్తున్న శ్రీనివాసు ను నిజామాబాద్ సిఎస్బి కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



## నల్లమల అడవుల్లోని సలేశ్వరం జాతరలో విషాదం

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6: నల్లమల అడవుల్లోని సలేశ్వరం జాతరలో విషాదం నెలకొంది. సలేశ్వరం జాతరకు వెళ్లిన ఇద్దరు భక్తులు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వనపట్ల గ్రామానికి చెందిన భక్తుడు గుండెపోటుతో మృతి చెందగా, వనపర్తి జిల్లాకు చెందిన మరో యువకుడు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు.

గతంలో ఎన్నడూ రానంత భక్తజనం ఈ ఏడాది సలేశ్వరం జాతరకు తరలివచ్చారు. సలేశ్వరం ఆలయం వద్దకు వెళ్లే దారిలో భక్తులు బారులు తీరారు. మన్ననూర్ నుంచి సలేశ్వరం జాతరకు వచ్చే మార్గాల్లో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.సలేశ్వరం జాతర ఈ నెల 5వ తేదీన ప్రారంభమైంది. రేపటి వరకు జాతర కొనసాగనుంది. ఉగాది తరువాత తొలి పౌర్ణమికి జాతర మొదలవుతుంది.



హైదరాబాద్ శుక్రవారం 7-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 183 పేజీలు:6 వెల: రూ.1/-


## భారతీయ రిజర్వు బ్యాంక్ రెపో రేటులో మార్పు లేదు

### – ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

న్యూఢిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారతీయ రిజర్వు బ్యాంక్ రెపో రేటులో మార్పు లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. గత ఏడాది మే నెల నుంచి ఆరుసార్లు రెపో రేటును పెంచిన నేపథ్యంలో తాజాగా మానెటరీ పాలసి కమిటీ సమావేశంలో ఈ రేటును యథాతథంగా ఉంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇది 6.5 శాతంగా కొనసాగుతుందని చెప్పారు. పరిస్థితినిబట్టి తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడం కోసం ఆర్బీఐ గత ఏడాది మే నెల నుంచి ఆరుసార్లు రెపో రేటును పెంచుతూ వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 5.2 శాతం ఉండవచ్చునని ఆర్బీఐ అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతం ఉంటుందని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణాన్ని సాధారణ స్థితికి తీసుకురావడంపై దృష్టిపెట్టినట్లు గవర్నర్ దాస్ తెలిపారు. చెప్పుకోదగ్గ స్థాయిలో ద్రవ్యోల్బణం తగ్గే వరకు దానిపై పోరాటం కొనసాగుతుందన్నారు.రెపో రేటు అంటే బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు. దీనిలో మార్పులవల్ల బ్యాంకులు ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లు ప్రభావితమవుతాయి. ఈఎంఐలలో హెచ్చుతగ్గులు వస్తాయి.బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సిస్టమ్ మన దేశంలో ఆరోగ్యవంతంగానే ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. మన దేశ ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాలు ఒత్తిళ్ళను తట్టుకునే విధంగా ఉన్నట్లు చెప్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7 శాతం వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## ఏప్రిల్ 10న కలెక్టర్ కార్యాలయల ముందు రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్షలు

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు ఈనెల 10వ తేదీన సోమవారం ఉదయం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తెలిపింది. ఈ దీక్షలో పెద్ద ఎత్తున రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొనాలని టీఎస్ జి ఆర్ ఇ ఎ జి.దామోదర్ రెడ్డి, ప్రభుత్వ పెన్షనర్స్ దారుల జేఏసి చర్మెన్ కే లక్ష్మయ్యలు పిలుపునిచ్చారు. నేడు టిఎస్జి రాష్ట్ర కార్యనిర్వాక వర్గ సమావేశం హైదరాబాదులోని బడి చౌడిలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి అధ్యక్షులు జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్, టీఎస్ జి ఆర్ ఇ ఎ ట్రెజర్ రాజేందర్ బాబు రాష్ట్ర ఉపాధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పెన్షనర్స్ అందరికి క్యాష్ లెస్ మెడికల్ ట్రీట్మెంట్ ను అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో కల్పించాలని, పెన్షనర్స్ అందర్నీ ఆదాయపు పన్ను నుండి మినహా ఇంపు ఇవ్వాలని, మూడు డిఏ లను వెంటనే ప్రకటించి బకాయిలు విడుదల చేయాలని, పెన్షన్ కమ్యూనికేషన్ ను 15 సంవత్సరములకు బదులుగా 12 సంవత్సరాలకే పరిమితం చేయాలని ప్రతినెలా ఒకటో తేదీని పెన్షన్లు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్,ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో బండి సంజయ్ ఆటలు: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ఖమ్మం,ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి): నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెలగాటమాడుతున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఖమ్మం నగరంలోని 25వ డివిజన్ మేదర బజార్‌లోని బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన కంటి వెలుగువైద్యశిబిరాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా ఒక్క స్కాం లేకుండా, అవినీతి, అవకతవకలకు ఆస్కారం లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందజేస్తుందన్నారు. ఇది ఓర్వలేని బీజేపీ నాయకులు కేసీఆర్, కేటీఆర్‌లను అప్రతిష్టపాలు చేసేందుకు టీఎస్‌పీఎస్సీ, పదోతరగతి పేపర్లను సాక్షాత్తు లీక్ చేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడే ఏ1గా ఉండి జైలుకు వెళ్లారని ఆరోపించారు.

తప్పుడు విధానాలతో రాజకీయాలు భ్రష్టు పట్టిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో మంజూరైన 178 మంది లబ్ధిదారులకు రూ. 1.78కోట్ల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

### నేటి కందం- నేటికి అందం

కం॥ ఈశ్వరా! మనుభవిస్తూ
ఆరోగ్య దినోత్సవమున నమలు ఉపగన్
పేరు గల భిషగ్వరులకు
నీరాజనమొసగుచుంటి నిర్మలమతినై ॥



–రాధశ్రీ

(ఏప్రిల్ 7 ప్రపంచ ఆరోగ్య దినోత్సవం..) సెల్:9494481210

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు:సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్ ఏప్రిల్,6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);:: ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బి.ఆర్.కె.ఆర్ భవన్ లో సీనియర్ అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనికత మేరకు ఏర్పాట్లు ఘనంగా ఉండాలన్నారు.ప్రధాన వేదిక వద్ద బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరి సరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని, ఆవరణ వద్ద సుందరీకరణ, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేయాలని ఆమె ఉ ఊఓఅ అధికారుల కు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష మందికి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయా లని ఆమె ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆమె ఆదేశించా రు.

అగ్నిమాపక శాఖ వారికి సంబంధించిన ఏర్పాట్లు చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా సిద్దంగా ఉంచాలని, అత్యవసర వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్ లను కూడా సిద్దంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు.

పార్కింగ్, ప్రాం గణం వద్ద ఇతర ఏర్పాట్లను, పటిష్టం చేయడానికి శుక్రవారం సంయుక్తంగా సందర్శించాలని, తగిన ఏర్పాట్లు చేయడానికి ఖీడః, పోలీస్, హెల్త్, సాంఘిక సంక్షేమ శాఖ, హైదరాబాద్ కలెక్టర్, ఇతర అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.ఆఉఖ అంజనీ కుమార్, క్రీడలు, యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సందీ ప్‌కుమార్ సుల్తానియా, జీఏడీ కార్య దర్శి శేషాద్రి, ఎస్.సి అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, టీఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, ఊఓ చిూః ఎండీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ఎస్‌సీడీడీ కమిషనర్ యోగితా రాణా, సీడీఎంఏ సత్యనారాయణ, ఖీడః ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రూ. 719 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కు కొత్త రూపు

హైదరాబాద్, ఏప్రిల్ 6:సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకోనుంది. అత్యాధునిక హంగులతో అభి వృద్ధి చేయనున్న ఈ స్టేషన్ విమానాశ్రయాన్ని తలపించ నుంది. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు ప్రయాణికులకు అందు బాటులోకి రానున్నాయి. ఈనెల 8న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో పలు అభి వృద్ధి పనులకు శంకుస్థాపన చేయనుండగా, మరికొన్నింటి ని ప్రారంభించనున్నారు. దేశంలోని అతి ముఖ్యమైన రైల్వే స్టేష న్లలో రాబోయే 50 ఏళ్లకు సరిపోయేలా సకల సౌకర్యాలు ఏర్పా టు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఇందులో సికిం ద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా ఒకటి. రూ.719 కోట్ల అంచనా వ్య యంగా నిర్ణయించారు. ఈ రైల్వే స్టేషన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపు దిద్దుకో నుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్‌కే తలమానికంగా నిలవనున్న ఈ రైల్వే స్టేషన్‌లో ప్రయా ణికుల విశ్రాంతి కోసం అత్యంత విలాసవంతమైన లాంజ్‌లు, రైళ్ల రాక పోకలను కచ్చితంగా తెలిపే సమాచార వ్యవస్థను ఏర్పా టు చేయనున్నారు. కాగా, ఈ రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రధాని మోదీ గతంలోనే రావాల్సి ఉం డగా పలు కారణాల వల్ల రెండుసార్లు వాయిదా పడింది. దీంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ తాజాగా ప్రధాని మోదీ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. కాగా, తన పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిచను న్నారు.

## 8న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

### – సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ రైల్‌ను ప్రారంబించనున్న ప్రధాని

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఈ నెల 8న హైదరాబాద్?కు ప్రధాని మోదీరానున్నారు. శనివారం ఉదయం 11.30గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్?పోర్ట్?కువచ్చిన తర్వాత ప్రధాని 11.35 గంటలకు బేగంపేట నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11.45 నిమిషాలకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోనున్నారు. సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైల్ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా.. మోదీ హైదరాబాద్ పర్యటనలో భాగంగా..రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వస్తారా లేదా అనేది రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రోటోకాల్ ప్రకారం సీఎం కేసీఆర్?కుఆహ్వానం పంపినట్లు తెలిపారు. కాగా, ఇప్పటికే తెలంగాణలో మోదీ పర్యటించినప్పుడల్లా కేసీఆర్ దూరంగా ఉంటున్నారు. మోదీ పర్యటనలో ప్రతిసారి సీఎం రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రధానమంత్రికి స్వాగతం పలికే సాంప్రదాయాన్ని కేసీఆర్ విస్మరిస్తున్నారని బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తోంది. దీంతో మరోసారి బీఆర్ఎస్, బీజేపీల మధ్య ప్రోటోకాల్ రగడ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల ప్రధాని పర్యటలో షెడ్యూల్ ప్రకారం కేసీఆర్ కు కొద్దీ సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. శనివారం హైదరాబాద్?కు భారత ప్రధాని పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. మోదీ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడడానికి 7నిమిషాల పాటు సమయం ఇచ్చినట్లు తెలుస్తోంది. 12.30గంల నుంచి 12.37నిమిషాల వరకు సీఎం కేసీఆర్?కు ప్రసంగానికి టైమ్ కేటాయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అసలు ప్రధాని మోదీ పర్యటనలో కేసీఆర్ హాజరవుతారా లేదా అనేది మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. చూడాలి మోదీ పర్యటనకు సీఎం హాజరవుతారా చివరకు ఏదైనా కారణం చెప్పి డ్రాప్ అవుతారా అనేది ఇప్పుడు కీలకంగా మారింది.

## విజయవంతంగా కొనసాగుతున్న మహిళా జర్నలిస్టుల ఆరోగ్య శిబిరం



హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్); సమాచార పౌర సంబంధాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో మహిళా జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో ఇప్పటివరకు 267 మహిళా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా జర్నలిస్టుల కు సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా జర్నలిస్టులకు మాస్టర్ హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేసింది.ప్రతి రోజు ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు నిర్వహించే మాస్టర్ హెల్త్ చెకప్ లో రక్త పరీక్ష (అ.ః.ఖ), బ్లడ్ షుగర్, డయాబెటిక్ పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, కాల్షియం, మూత్ర పరీక్షలు, విటమిన్ ః12, ఆ3 మొదలైనవి, ఇఅఉ, ఎక్స్-రే, అల్ట్రాసోనోగ్రఫీ, మా మోగ్రామ్, పాప్ స్మెర్ వంటి రోగని ర్థారణ పరీక్షలు ఉన్నాయి, స్క్రీనింగ్ పరీక్షలు, మెడికల్ ఆఫీసర్ ఎగ్జామి నేషన్, ఐ స్క్రీనింగ్, డెంటల్ పరీక్షలు, గైనకాలజీ పరీక్షలు చేస్తున్నారు. అదేరోజు పరీక్షల నివేదికలను అందచేస్తున్నారు. ఏప్రిల్ 9 వ తేదీ వరకు ఈ ఆరోగ్య శిబిరం పనిచేయనున్నది. మహిళా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ తెలిపారు. వైద్య అధికారులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల స్వీయ పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ విధానం పట్ల పరీక్షలు చేయించుకున్న మహిళా జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వాన్ని అస్థిర పర్చేందుకే పేపర్ లీకేజీలు : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఏప్రిల్ 6: : రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని తుంగుతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆరోపించారు. గురువారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ పేపర్ లీకేజీలకు పాల్పడ్డాడని అన్నారు.

పేపర్ లీకేజీ ప్రభావంతో లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మానసిక సంఘర్షణకు ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. పేపర్ లీకేజీలకు కారకుడైన బండిసంజయ్‌ను బీజేపీ ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు ముగిసే వరకు ఆయనను జైలులోనే ఉంచాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే సీబీఐ, ఈడీల విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

## ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌ను అభినందించిన సి.ఎస్ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); :: 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 50 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకొని రికార్డ్ సృష్టించిన నిఖత్ జరీన్ ను నేడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్ లు నేడు దుశ్శాలువా, పుష్పగుచ్చాలతో అభినందించారు. బీఆర్ కేఆర్ భవన్ లో సి.ఎస్. శాంతి కుమారిని ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్ నేడు మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రపంచ చాంపియన్ షిప్ ను సాధించి భారత దేశంతో పాటు తెలంగాణా ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలిపిన నిఖత్ జరీన్ ను సి.ఎస్. శాంతి కుమారి అభినందించారు.

ఈ విజయంతో ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలుచుకున్న రెండవ భారతీయ బాక్సర్‌గా నిఖత్ జరీన్ చరిత్ర సృష్టించిందని, నేటి యువ క్రీడాకారులకు జరీన్ ఆదర్శవంతంగా నిలిచిందని డీజీపీ అంజనీ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడలు, యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్.సి అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాలు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమీపంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్( సమీపంలో ఓ వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు.. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే నిప్పంటించుకున్నబాధిత వ్యక్తిని సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన సమయంలో.. ఈ దేశాన్ని కాపాడండి అంటూ.. మోదీకి వ్యతిరేకంగా అతను నినదించాడు. బాధిత వ్యక్తిని రోహిణికి చెందిన రాజ్‌కుమార్ శర్మగా పోలీసులు గుర్తించారు. పార్లమెంట్ సమీపంలో రాజ్ కుమార్ శర్మ ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందన్న కోణంలో ఢిల్లీ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి మద్దతుగా ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది.






రచనలకు ఆహ్వానం

కండలు కరిగించె కార్మికులు
చెమటోడ్చి కష్టపడే కర్షకులు
బతుకులను వెల్లబోసే పేదవాళ్ళు
మౌన యంత్రాలై కదిలిపోతున్నా
సమాజం 'శ్రమ'ను గుర్తించటం లేదు.

'శ్రమ'
ఎవరికీ కనిపించని విలువ
ఎవరికీ అర్థంకాని బతుకు

అలాంటి 'శ్రమ'కు గుర్తింపే
శ్రామికుల, కార్మికుల దినోత్సవం
'మేడే'
ఈ సందర్భంగా

"శ్రమ"

అంశంపై వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

ఏప్రిల్ 15లోగా మీ వ్యాసాలు కవితలను పంపగలరు.

నేటినిజం దినపత్రిక,
ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

E-mail : netinijam93@gmail.com

# పేదరిక కోరల్లో అనారోగ్య భారతం..!

## (07 ఏప్రిల్ 'ప్రపంచ ఆరోగ్య దినం' సందర్భంగా)

విశ్వ మహమ్మారి విలయతాండవానికి విలవిల్లాడుతున్న ప్రపంచ మానవాళి ఆరోగ్యానికి సరైన ఔషధ చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో, బయట పడటానికి మార్గాన్వేషణ యజ్ఞంలో ఆరోగ్య పరిరక్షణ నిపుణులు నిమగ్నమై టీకాలను సకాలంలో అందించి లక్షల కోట్ల ప్రాణాలను కాపాడడం మనమింకా మరిచిపోలేదు. నాలుగవ వేవ్ భారత్‌ను కుదుపేయవచ్చనే సంధి కాలంలో కరోనాతో సహజీవనానికి సిద్ధం కావాలని, వైరస్ విధించిన నియమనిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, బూస్టర్ డోసు టీకాలను విధిగా తీసుకోవాలని సూచించడం మాత్రమే కోవిడ్-19 కట్టడికి ఏకైక మార్గమని తెలుస్తున్నది. మహమ్మారుల విపత్తులతో పాటు సీజనల్ వ్యాధుల సునామీలు, ఫ్లూ జ్వరాలు, పర్యావరణ కాలుష్య సంబంధ అనారోగ్య సమస్యల పరిరక్షణకు సంబంధించిన అవగాహన, ఆలోచనల్ని మరో సారి మననం చేసుకోవడానికి 1948లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సౌజన్యంతో 1950 నుండి ప్రతి ఏటా ఐరాస సభ్యదేశాల్లో డబ్ల్యూహెచ్ఓ వ్యవస్థాపక దినమైన 07 ఏప్రిల్ రోజున 'ప్రపంచ ఆరోగ్య దినం (వరల్డ్ హెల్త్ డే)' నిర్వహించు కోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఐరాస నిర్వహించే 09 అధికారిక ప్రపంచ ప్రజారోగ్య సంబంధ వేదికల్లో ప్రపంచ ఆరోగ్య దినం ప్రధానమైందని తెలుసుకోవాలి.

### "అందరికీ ఆరోగ్యమే" మన నినాదం:

అన్ని ఐశ్వర్యాల్లోకి ప్రథమమైనది సంపూర్ణ ఆరోగ్యమే. ఆరోగ్యమే మహాభాగ్యం. వ్యక్తి శారీరక, మానసిక, భావోద్వేగ సంతులిత జీవన స్థితినే అసలైన ఆరోగ్యమని ఐరాస నిర్వచించింది. కాలానుగుణంగా ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రజారోగ్య సమస్యలు, సవాళ్ళకు సమయానుకూలంగా సూచనలు, సలహాలు, హెచ్చరికలను చేయడానికి ప్రపంచ ఆరోగ్య దినం వేదిక ఉపయోగపడుతోంది. కరోనా మహమ్మారి దుష్ప్రభావాలతో పాటు ఉక్రెయిన్ రష్యాల మధ్య భీకర యుద్ధం పుండు మీద కారం చల్లినట్లు మానవాళి ఆర్థిక చక్రం గాడి తప్పడం, చమురు ధరలు చుక్కలనంటడం, నిత్యావసరాల ధరలు అటకెక్కడం, ఉద్యోగ ఉపాధులు తగ్గి పోవడం, వేతన కోతలు అమలు కావడం, పేదరికం పెరగడం, పోషకాహారలోపాలతో ప్రాణాలు గాల్లో దీపాలుగా మారిపోయిన దీనస్థితిలో మానవ సమాజం ఉన్నది. వ్యక్తి ఆరోగ్య పరిరక్షణకు కావలసిన ప్రథమ ఔషధం సంపూర్ణ అవగాహన మాత్రమే అని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య దినం-2023 నినాదంగా 'అందరికీ ఆరోగ్యం (హెల్త్ ఫర్ ఆల్)' అనబడే సముచిత అంశాన్ని తీసుకుని ప్రచారం చేస్తున్నారు.

### అనారోగ్య సమస్యల భారతం:

భారత దేశంలో ఆరోగ్య పరిరక్షణకు సవాళ్ళుగా ఆర్థిక వెనకబాటుతనం, గృహ/ఆవాస పరిసరాల అపరిశుభ్రత, అవిద్య, ఉపాధి లేమి, అధిక జనాభా, సామాజిక/ఆరోగ్య అసమానతలు, పేదరికం, లింగ అసమానతలతో మహిళాలోకం నలిగి పోవడం, ఆరోగ్య పట్ల అవగాహనా లేమి, పర్యావరణ గాలి/నేల/జల కాలుష్యం, సురక్షిత నీటి కొరత, ఆహార అభద్రత, వైద్య సదుపాయాల కొరత లాంటి పలు సమస్యలు నిలుస్తున్నాయి. దశాబ్దాలుగా మానవ సమాజాన్ని వెంటాడుతున్న మానసిక అనారోగ్యం, మాతాశిశు సంక్షేమ సవాళ్ళు మరియు వాతావరణ మార్పులు ముఖ్యమైన ఆరోగ్య అంశాలుగా గుర్తించారు. ఇండియాలో సాధారణ ఆరోగ్య సమస్యలుగా కాన్సర్, వంధ్యత్వం, కంటి శుక్లాలు, పుట్టుకతో వచ్చే అనారోగ్యాలు, వినికిడి సమస్యలు, మధుమేహం, గుండె జబ్బులు, అంటువ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, టిబి, విరోచనాలు, బిపి, స్థూలకాయం లాంటివి గుర్తించబడ్డాయి.

### ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకుందాం:

వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం, క్రమశిక్షణ కలిగిన జీవనశైలి, శారీరక వ్యాయామం, శారీరక శుభ్రత, దురవాట్లు లేక పోవడం, మానసిక ప్రశాంతతకు సదాలోచనలు చేయడం లాంటివి వస్తాయని మరువరాదు. ఆరోగ్యవంతులే అభివృద్ధి రథాన్ని పరుగులెత్తించే రథసారథులని గమనించాలి. ప్రాణం ఉంటేనే జీవితమని, జీవితంలో ఆరోగ్యమే మహాభాగ్యమని భావించి మన ఆరోగ్యన్ని మనమే కాపాడుకుందాం. ఆరోగ్య భారత నిర్మాణంలో మన వంతు కర్తవ్యాన్ని నిర్వహిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# కర్ణాటకపై కన్నేసిన ఎంఐఎం.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ

బెంగళూర్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎంఐఎం.. హైదరాబాద్ లో పుట్టిన ఈ పార్టీ దేశవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పటికే మహారాష్ట్ర బీహార్ యుపీ గుజరాత్ సహా ముస్లిం జనాభా ఎక్కడ అధికంగా ఉంటే ఆ ప్రాంతంలో పోటీచేస్తూ గెలుస్తూ వస్తోంది. ఇప్పుడు పక్క రాష్ట్రం కర్ణాటకపై కన్నేసింది. అక్కడ బరిలోకి సన్నాహాలు చేస్తోంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో అక్కడ ఎన్నికల సందడి మొదలైంది. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేయడానికి మరో పార్టీ సిద్ధమైపోయింది. ఇప్పటికే హైదరాబాద్ తోపాటు తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఎంఐఎం పార్టీ కర్ణాటకలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 25 చోట్ల పార్టీ అభ్యర్థులను దింపడానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. కర్ణాటకకు చెందిన ఎంఐఎం పార్టీ సీనియర్ నేత ఒస్మాన్ ఘని మంగళవారం మీడియాతో మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మా పార్టీ బలంగా ఉన్న 25 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేస్తారని ఘని మీడియాకు తెలిపారు. జేడీఎస్ పార్టీతో పొత్తు పెట్టుకొని కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తోందని.. ఇప్పటికే మాజీ ప్రధాని దేవెగౌడతో చర్చలు జరిపామని ఘని వివరించారు. అయితే జేడీఎస్ తో పొత్తు విషయంలో ఎలాంటి క్లారిటీ రాలేదని.. వేచిచూస్తున్నట్టు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. జేడీఎస్ తో పొత్తు ఉన్నా లేకున్నా కర్ణాటకలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఖచ్చితంగా పోటీచేస్తుందని.. ఇప్పటికే ముగ్గురు అభ్యర్థుల పేర్లను మా పార్టీ ప్రకటించిందని ఘని వివరించారు. ఇక ఎంఐఎం పార్టీ పోటీతో కాంగ్రెస్ కే నష్టమని భావిస్తున్నారు. ముస్లిం ఓట్లు చీలిపోయి బీజేపీకి లాభం కలుగుతుందని పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. కర్ణాటకలో ముస్లింలకు కేటాయించిన 4శాతం రిజర్వేషన్ ను బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం రద్దు చేసినప్పుడు ఎందుకు ఆందోళన చేయలేదని.. ఎందుకు మౌనంగా ఉండిపోయారని ఎంఐఎం పార్టీ నాయకులు ప్రశ్నించారు. 2018లో జేడీఎస్ తో పొత్తు పెట్టుకున్న ఎంఐఎం పార్టీ ఆ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పోటీ చేయలేదు. అయితే 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఖచ్చితంగా పోటీచేస్తుందని ఆ పార్టీ నాయకులు క్లారిటీ ఇచ్చారు.

# భారత్ కీలక స్థావరాల పై డ్రాగన్ కన్ను ?

న్యూ డిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తనచుట్టుపక్కలున్న అన్నీ దేశాలను ఏదోరూపంలో కబళించాలని చూస్తోంది చైనా. అప్పులిచ్చి ఇచ్చి తిరిగి చెల్లించలేని పరిస్థితికి తీసుకొచ్చేసి పాకిస్థాన్ను తర్వాత శ్రీలంకలో కొంత భూభాగాన్ని ఒకరకంగా కబ్జా చేసేసింది. తర్వాత నేపాల్ బంగ్లాదేశ్ విషయంలో కూడా చైనా ఇలాగే వ్యవహరిస్తోంది. అంటే భారత్ చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ చైనా వ్యూహాత్మకంగా పట్టుబిగించేస్తోంది. ఇవన్నీ సరిపోవన్నట్లు అండమాన్ నికోబార్ దీవుల్లో తిష్టవేయటానికి డ్రాగన్ అన్నీ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు బయటపడింది.

భారత్ తో మంచి సంబంధాలు మైన్ టైన్ చేసేందుకు పాశ్చాత్యదేశాలు చాలా ఉత్సాహం చూపిస్తున్నాయి. ఎందుకంటే భారత్ మీద ప్రేమ పొంగిపోయి కాదు. హిందూ మహాసముద్రంలో వ్యాపారపరంగా భారత్ కీలకమైన వ్యూహాత్మక పాయింట్ లో ఉండటమే. ఆ వ్యూహాత్మకమైన పాయింట్ అండమాన్ నికోబార్ దీవులకు దగ్గర్లో ఉంది. దీని పైన భారత్ దే సంపూర్ణ ఆధిపత్యం. పసిఫిక్-హిందు మహాసముద్రం గుండా జరగాల్సిన వ్యాపారానికి షార్ట్ కట్ మార్గమే మలక్కా.

ఈ మలక్కా మార్గంలో ఏడాదికి 90 వేల నౌకలు ప్రయాణిస్తాయి. వీటిల్లో 9.4 బిలియన్ టన్నుల సరుకు రవాణా అవుతుంది. అంటే ప్రపంచవాణిజ్యంలో 40 శాతం వ్యాపారం మలక్కా నుండే జరుగుతోంది. ఇంతటి కీలకమైన మలక్కా మీద డ్రాగన్ కన్నుపడిందట. అండమాన్ లోనే మన త్రివిధ దళాలకు చెందిన జాయింట్ కమాండ్ కూడా ఉంది. ఇంతటి కీలకమైన ప్రాంతంమీద డ్రాగన్ కన్నుపడిందని సమాచారం. దక్షిణ చైనా సముద్రం హిందూ మహా సముద్రంలోకి చైనా కీలకమైన ప్రాంతాల్లోకి 33 నౌకలను పంపాలని నిర్ణయించిందట. ఇవన్నీ సర్వే నౌకలనని డ్రాగన్ చెబుతున్నా ఎవరు నమ్మటంలేదు. సర్వే నౌకల పేరుతో చైనా అన్నీ దేశాల పైన గూఢచర్యం చేస్తోందనే అనుమానాలు పెరిగిపోతున్నాయి. ఇందులో భాగంగానే చైనా నౌకలు అండమాన్ నికోబార్ దీవుల దగ్గరకు రెగ్యులర్ గా వస్తున్నాయట. మనదేశం పరీక్షిస్తున్న మిస్సైల్స్ పాయింట్లన్నీ ఇక్కడే ఉన్నాయి. అందుకనే చైనా కూడా సర్వేల పేరుతో తన నిఘా నౌకలను ఇక్కడే మోహరించిందట. అంటే మనదేశాన్ని ముప్పుతిప్పలు పెట్టడానికే చైనా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని అర్థమవుతోంది. మరి మనదేశం ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే.

# పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టండి

## -కేంద్ర మంత్రి భూపేంద్ర సింగ్ యాదవ్‌ను కలిసిన బీసీ సంఘం నేతలు



న్యూ డిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పార్లమెంట్ ఆవరణలో కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోల్క వెంకట్ యాదవ్ నేతృత్వం లో భూపేంద్ర సింగ్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

ప్రైవేటు రంగంలో ఎస్సి,ఎస్టి, బిసి లకు రిజర్వేషన్లు పెట్టాలని బీసీల హక్కుల పరిరక్షణ కోసం పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని దేశంలో 56% ఉన్న బీసీలకు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగలను చేయాలని కోరారు.

అలాగే పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు పెట్టాలని, అందుకు అందరు సహకరించాలని పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కే.లక్ష్మణ్,గాయిత్రి రవి, గోరింట్ల మాధవ్,వినయ్ టెండూల్కర్, పిల్లి సుబాష్ చంద్ర బోస్,బీద మస్తాన్ రావు,అఖిలేష్ యాదవ్, డింపుల్ యాదవ్,బడుగు లింగయ్య యాదవ్, తదితర ఎంపి లను కలిసి విజ్ఞప్తి చేసారు. ఇట్టి కార్యక్రమంలో లాల్ కృష్ణ,కర్రి వేణు మాధవ్, ఆకుల స్వామి పటేల్ వేముల రామకృష్ణ బోయిన పృధ్వి యాదవ్ తిరుమల నాగరాజు రాజు వెంకటేశు తదితరులు పాల్గొన్నారు

# విశాఖ ఎయిర్ పోర్టులో చంద్రబాబును కలిసిన ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు

విశాఖపట్టణం ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ను విశాఖ ఎయిర్ పోర్టు లో ఉక్కు పరిరక్షణ కమిటీ నేతలు కలిసారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్లాంట్‌ను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని చంద్రబాబు చెప్పారన్నారు. కానీ జగన్ సర్కారు పూర్తిగా విఫలం అయిందని.. ఈ సమస్యను ఢిల్లీ వరకు తీసుకెళ్తానని చెప్పారన్నారు. గత కొన్ని ఏళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా.. కేంద్రం, జగన్ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. అందుకే చంద్రబాబుని కలిశామని చెప్పారు. కార్మిక సంఘాల నేతలను ఢిల్లీకి తీసుకు వెళతామని చెప్పి వైసీపీ నేతలు మాట తప్పారని, కనీసం అఖిల పక్షం నేతలనైనా సీఎం జగన్ ఢిల్లీకి తీసుకువెళ్ళాలని... ప్రైవేటీకరణను ఆపాలని.. లేదంటే ప్రజలు విశ్వసించరని కమిటీ నేతలు పేర్కొన్నారు. కాగా బుధవారం తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల క్లస్టర్ సమావేశం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడుముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా వైఫల్యాలు, ఉత్తరాంధ్ర సమస్యలపై చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరో ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సమయత్తం చేయటమే లక్ష్యంగా సభ జరగనున్నట్లు తెలియవచ్చింది. ఈ సమావేశానికి సుమారుగా 3వేల మంది నేతలు హాజరవుతున్నట్లు సమాచారం.

# పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు



ఖమ్మం,ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి): పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. నగరంలోని 25వ డివిజన్ మేదర బజార్ లోని బస్తి దవాఖానలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం క్రింద మంగళవారం నాటికి 3 లక్షల 58 వేల 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన అన్నారు. ఇందులో లక్షా 71 వేల 299 మంది పురుషులు,లక్షా 86 వేల 598 మంది స్త్రీలు, 103 ట్రాన్సజెండర్ లు ఉన్నారన్నారు. 283 గ్రామ పంచాయతీలు,66 వార్డుల్లో కార్యక్రమం పూర్తి చేసినట్లు, 43 గ్రామ పంచాయతీలు,12 వార్డుల్లో పురోగతి లో ఉన్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష అనంతరం79వేల923మందికి రీడింగ్ కళ్ళద్దాలు ఆందజేసినట్లు, 49 వేల 763 మందికి ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాలు అవసరం గుర్తించి, ఆర్డర్ అనంతరం30వేల409మందికి ఆందజేసినట్లు, 2లక్షల 28వేల 360మందికి కంటి సమస్యలు లేనట్లు మంత్రి తెలిపారు. ప్రజలు ఎవరూ కంటి సమస్యలతో బాధపడవద్దనే లక్ష్యంతో కంటి పరీక్షలను నిర్వహించి అద్దాలతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లను సైతం చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన ఉందన్నారు. గ్రామాల్లో ముందస్తుగా శిబిరం ఏర్పాటు గురించి టాంటాం ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు, శిబిరానికి హాజరు కావాల్సినదిగా ఆహ్వాన పత్రికలు ఆందజేసినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి, కార్యక్రమం పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రభుత్వం పూర్తి ఉచితంగా కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ,సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్,మదురి ప్రసాద్,జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. బి. మాలతి,వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మంత్రి ధర్మాన మాటలు వైసీపీ అసహనానికి అద్దం పడుతోందా..?

అమరావతి ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏపీలో అధికార వైసీపీ నేతలను ఓటమి భయం వెంటాడుతోందా..? ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు) ఇచ్చిన షాక్‌కు ఫ్రస్టేషన్ పీక్స్‌కు వెళ్లిపోయిందా..? ఓటేసిన ఓటర్లను, మహిళలను కించపరిచేలా వైసీపీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడటం వైసీపీ అసహనానికి అద్దం పడుతోందా..? శ్రీకాకుళం జిల్లాలో తాజాగా మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు అధికార వైసీపీ నేతల అసహనం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేసింది.'ప్రభుత్వం డబ్బులు పంచుతుంటే.. జగన్ ఇంట్లో నుంచి ఏమైనా ఇస్తున్నారా? అని కొంతమంది మహిళలు అంటున్నారని, ఎవరైనా ఇంట్లోది ఇస్తామంటే.. వారి ఇంటికే వెళదాం. పథకాల ద్వారా డబ్బులు తీసుకుని కూడా సంస్కారవంతమైన మాట రాకపోతే ఎలా? పద్దుకుమాలిన (ఉత్తరాంధ్ర యాసలో పనికిమాలినవాళ్లు అని అర్థం) ఆడవాళ్లే ఇలా మాట్లాడతారు' అని మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. మహిళలను శక్తిమంతులుగా మారుస్తున్న ప్రభుత్వానికి మరోసారి అధికారాన్ని అప్పగించాలని కోరారు. పథకాలు తీసుకుని ఓటు వేయకపోతే మీ చేతిని మీరు నరుక్కున్నట్లే అన్నారు.

శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం స్కూల్, రాగోలులో నిర్వహించిన 'ఆసరా పంపిణీ' కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలివి. మహిళలను పనికిమాలిన వాళ్లు అని ముందూవెనుకా ఆలోచించకుండా తూలనాడటం, ఓటేసిన ఓటర్లను బెదిరించే రీతిలో వైసీపీకి ఓటేయకపోతే పుట్టగతులు ఉండవన్నట్టుగా మంత్రి ధర్మాన బ్లాక్‌మెయిల్ చేయడం ఆయన ఫ్రస్టేషన్ స్థాయిని సూచించిన పరిణామాలు. ధర్మాన ఇటీవల పదేపదే ఈ తరహా చౌకబారు వ్యాఖ్యలు చేస్తూ విమర్శల పాలవుతుండటం గమనార్హం. మహిళలనే కాదు ధర్మాన ప్రసాదరావు ఈ మధ్య మగవాళ్లను ఉద్దేశించి కూడా కించపరిచే రీతిలో మాట్లాడటం కొసమెరుపు. "మగవాళు పోరంబోకులు.. తినేసి వెళ్లిపోతారు. వారికి బాధ్యతలు పట్టవు" అని మంత్రి ధర్మాన ప్రసాదరావు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.'వైఎస్సార్ ఆసరా' నిధుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలోని కిల్లిపాలెం, హడ్కోకాలనీల్లో ఆయన పర్యటించిన సందర్భంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు చోట్ల మహిళలతో సమావేశం నిర్వహించారు. కిల్లిపాలెంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. "మగవాళ్లు పోరంబోకులు. ఇంటిని నడిపేది ఇల్లాలు. ఆమె పేరుతో ప్రభుత్వం పథకాలు అందిస్తోంది. ఈ ప్రభుత్వానికి మరోసారి అధికారం అప్పగించే అధికారం మీ చేతుల్లోనే ఉంది." అని ధర్మాన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు విని అక్కడున్న వారు అవాక్కయ్యారు. మగవాళ్లను పోరంబోకులని అనడం ఏంటో అని విస్మయం వ్యక్తం చేశారు. జగన్ మహిళలకు అంత చేస్తున్నాడు, ఇంత చేస్తున్నాడని డప్పు కొట్టుకునే మైకంలో పడి.. మగాళ్లను పోరంబోకులన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆయన కూడా మగాళ్లలో ఒకడన్న విషయాన్ని మర్చిపోవడం కొసమెరుపు.

అదేవిధంగా.. ఇటీవల గార మండలంలోని ఓ గ్రామానికి వెళ్లినట్టు మంత్రి చెప్పారు. అక్కడ ఓ మహిళను..ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?ఎవరిస్తున్నారు..? అని ప్రశ్నించినట్టు తెలిపారు. దానికి ఆవెం.. "అన్ని పథకాలూ అందుతున్నాయి. జగన్ ఇస్తున్నారు" అని చెప్పిందన్నారు. దీంతో "మరి ఓటు ఎవరికి వేస్తావు.. అని అడగ్గా.. సైకిల్‌కు వేస్తాను అని చెప్పింది. ఆమెకు జగన్ ఇస్తున్న పథకాలు తెలుసు కానీ.. పార్టీ గుర్తు తెలియలేదు. చాలామంది ఇలానే ఉన్నారు. వీరికి పూర్తిగా అవగాహన కల్పించాలి" అని ధర్మాన కవర్ చేసుకునే ప్రయత్నం చేశారు. కానీ.. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఫలితాలతో ధర్మానలో ఓటర్లపై అసహనం కట్టలు తెంచుకోవడం గమనార్హం. మహిళలనే కనీస ఆలోచన లేకుండా మాట్లాడటం, ఓటర్లకు శాపనార్థాలతో బ్లాక్‌మెయిల్ చేయడం మంత్రి ధర్మానకే చెల్లిందని ప్రతిపక్ష టీడీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది.

ఒక్క ధర్మాన మాత్రమే కాదు.. వైసీపీ ప్రజాప్రతినిధుల్లో మహిళలంటే కనీస గౌరవం లేనివాళ్లు చాలామందే ఉన్నారని తాజాగా వైసీపీ అనర్హత వేటు వేసిన ఉండవల్లి శ్రీదేవికి ఎదురైన చేదు అనుభవాలు స్పష్టం చేశాయి. ఈ తాడికొండ ఎమ్మెల్యేపై వైసీపీ అధిష్టానం వేటేసిన మరుక్షణం నుంచి ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే వైసీపీ నేతలకు పనైపోయింది. అటు నీలి మీడియాలో, ఇటు సోషల్ మీడియాలో ఉండవల్లి శ్రీదేవిని అవమానించడమే పనిగా పెట్టుకుని పనిచేయడం శోచనీయం. వైసీపీ నేతలు ఆమెపై ఏ స్థాయిలో విషం కక్కారంటే.. ఆమె దాంపత్య జీవితంపై కూడా అవాకులుచవాకులు పేలారు.

ఉండవల్లి శ్రీదేవికి, ఆమె భర్త కమ్మెల శ్రీధర్‌కు గొడవలున్నాయని, ఇద్దరూ కలిసి ఉన్నట్టు మీడియా ముందు కలరింగ్ ఇస్తున్నారని రకరకాలుగా దిగజారిపోయి వైసీపీ సోషల్ మీడియాలో పనిగట్టుకుని ప్రచారం చేసింది. గతంలో పవన్ కల్యాణ్ పెళ్లిళ్ల అంశాన్ని ప్రస్తావిస్తూ.. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని ఆయన మాజీ మొదటి భార్య పేరును, మాజీ రెండో భార్య గురించి సానుభూతి ముసుగులో అనవసరంగా ఎలా మహిళల జీవితాలను రోడ్డుకీడ్చారో ప్రత్యేకంగా చెప్పనక్కనర్లేదు. ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉందని వైసీపీ అధినేత జగన్ చెబుతున్నప్పటికీ వైసీపీ ఎమ్మెల్యేల, మంత్రుల అసహనం చూస్తుంటే ఈలోపు ఆ పార్టీ ఇమేజ్ మరింత డ్యామేజ్ కావడం ఖాయంగా కనిపిస్తోంది.

# పంజాబ్ మాదిరిగా మారిన ఏపీ :ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ పై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్ మాదిరిగా ఏపీ మారిందని ప్రధాని అన్నారు. శాంతి భద్రతలు రోజు రోజుకి క్షీణించిపోతున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ తో తన అభిప్రాయాలను ప్రధాని పంచుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు ఎంపీ కనకమేడల ప్రధాని మోదీని కలిశారు. ఏపీలో పరిస్థితులు ఎలా ఉన్నాయని మోదీ ఆరా తీశారు. ఏపీలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను కనకమేడల ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ గురించి అన్ని విషయాలు తనకు తెలుసని మోదీ అన్నారు. అన్ని విషయాల్లో ఏపీ పంజాబ్‌లా తయారైందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఆర్థిక, శాంతి భద్రతల పరిస్థితులు తన దృష్టిలో ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. 5 కోట్ల రాష్ట్ర ప్రజలను మీరే కాపాడాలని ప్రధాని మోదీని ఎంపీ కనకమేడల కోరారు. కనకమేడల విజ్ఞప్తికి సానుకూలంగా ప్రధాని మోదీ స్పందించారు. గతంలో చంద్రబాబు కూడా ఈ విషయం తన దృష్టికి తీసుకువచ్చినట్టుగా మోదీ గుర్తుచేశారు. ఏపీలో నెలకొన్న పరిస్థితులు పట్ల విచారం వ్యక్తం చేసినట్లు టీడీపీ ఎంపీ కనకమేడల వెల్లడించారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే అరెస్టేలా? : మల్లు రవి

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో రాజకీయ డ్రామా రసకందాయకంగా నడుస్తోందని కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. బుధవారం ఆయన గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ లో రెండు వారాల తర్వాత ఛైర్మన్‌ను విచారణ చేశారని, సిట్ విచారణ వద్దని.. సీబీఐ విచారణ కావాలని అఖిలపక్షం మొత్తం కోరిందన్నారు. మరోవైపు టెన్త్ పేపర్ వరుసగా రెండు రోజులు లీకైయిందని.. ఎగ్జామినేషన్ సిస్టంను పనిచేయించే వ్యవస్థ ప్రభుత్వం దగ్గర లేదని మల్లు రవి విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైల్లో పెట్టారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారి నోళ్లను అరెస్టుల ద్వారా మూయిస్తోందని, తెలంగాణ ప్రభుత్వ పాలన గాడితప్పిందని అన్నారు. ప్రశాంత్ బండి సంజయ్ తో వందల సార్లు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని మల్లు రవి ప్రశ్నించారు. బీజేపీ నేతలను అరెస్ట్ చేయడం ద్వారా బీఆర్ఎస్ లీక్‌ల మీద పోరాడుతున్నట్లుగా బీజేపీ ఎక్స్‌పోజ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న టీఎస్‌పీఎస్సీ సభ్యులు, ఛైర్మన్‌ను మార్చి కొత్త వారిని నియమించాలని మల్లు రవి డిమాండ్ చేశారు.

# పేదలకు ఊడిగం చేసేది మా పార్టీనే : ఎమ్మెల్యే భూమన



తిరుపతి, ఏప్రిల్ 6: పేదలకు ఊడిగం చేసే పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. గురువారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపం నందు జగనన్నే మా భవిష్యత్తు ? మా నమ్మకం నువ్వే జగన్ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో గృహ సారథులు, కన్వీనర్లు బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. ఐదున్నర కోట్ల మంది ప్రజలు దగ్గరకు రేపటి నుంచి 21 వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. చంద్రబాబు జగన్ పై వ్యక్తిగత దూషణలు చేయడం తప్ప, తాను వస్తే ఏమి చేస్తాడు అనేది చెప్పడం లేదన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి 87 శాతం ప్రజలకు మూడున్నర లక్షల రూపాయలు సగటు నా అందించడం జరిగిందన్నారు. జగనన్న మా భవిష్యత్తు అనే కార్యక్రమం రేపటి నుంచి శ్రీకారం చుట్టడం జరుగుతున్నది అన్నారు. ప్రజా ప్రతినిధులు సచివాలయం కన్వీనర్లు గృహ సారథులు, వాలంటీర్లు అందరూ కలిసి ప్రతి ఇంటికి వెళ్లడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన మోసం ప్రతి ఇంటికి వెళ్లి వివరించడం తోపాటు ఇంటి యజమాని అనుమతితో స్టిక్కర్లు అందించడం జరుగుతుందన్నారు. ప్రపంచంలో దేశ రాజకీయాల్లో ఎక్కడ కూడా ఒకేసారి ఏడు లక్షలు మంది వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ జెండాలు చేతబట్టి ఐదున్నర కోట్ల మంది ప్రజల్ని ప్రతి ఇంటికి వెళ్లి కలవడం జరుగుతుందని తెలియజేశారు. మూడున్నర లక్షల కోట్లు పేదలకు ఇచ్చిన ఘనుడు సీఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఒకరే పేదల జీవితాలు మార్చాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం. మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన్ అభినయ రెడ్డి. ముద్ర నారాయణ, నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కేతనీ జయచంద్ర రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పాన్-ఆధార్ లింకేజీలో జాప్యంపై జరిమానా.. సమర్థించిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:పాన్‌తో ఆధార్‌ను లింక్ చేయడంలో జాప్యానికి విధిస్తున్న జరిమానాను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. మార్చి నెలాఖరుతో పాన్ ? ఆధార్ గడువును పూర్తిగా.. సీబీడీటీ జూన్ నెలాఖరు వరకు పొడించింది. అయితే, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పాన్ ? ఆధార్ లింక్ చేసుకుంటున్న వారికి రూ.1000 వరకు జరిమానా విధిస్తున్నది. వాస్తవానికి గతేడాది మార్చి 31తో గడువు ముగియగా.. ఆ తర్వాత రూ.500 జరిమానా విధించారు. గడువు ముగిసిన తర్వాత పాన్‌తో ఆధార్‌ను అనుసంధానం చేయకపోతే పాన్ కార్డు పని చేయదని సీబీడీటీ స్పష్టం చేసింది.

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం విలేకరుల సమావేశంలో ఈ విషయంపై స్పందించారు. పాన్‌తో ఆధార్‌ను అనుసంధానించేందుకు చాలా సమయం ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రక్రియను పూర్తి చేసుకొని ఉండాల్సిందన్నారు. ఇప్పటి వరకు చేయని వారు సైతం చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా.. గడువులోగా పాన్-ఆధార్ అనుసంధానం చేయకపోతే పాన్‌కార్డుతో ఎలాంటి లావాదేవీలు చేసేందుకు అవకాశం ఉండదు. మీకు ఏవైనా రీఫండ్స్ రావాల్సి ఉన్నట్లయితే.. ఈ విషయంలో ఇబ్బందులెదువుతాయి. రిటర్న్స్‌ను సైతం సరిచేయడం వీలుకాదు. దీని ఫలితంగా ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తుంది.

# మీ వాటాల ఒప్పందం కుదరకపోతే పేదలను ఇబ్బంది పెడతారా : సీపీఐ నేత నారాయణ



తిరుపతి, ఏప్రిల్ 6: చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూ హక్కుదారులు తమ నివేశన స్థలాలలో ఇండ్లు నిర్మించుకుంటే సిపిఐ, సిపిఎంగా మేము అండగా ఉంటామని శెట్టిపల్లి భూ బాధితులకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ భరోసా ఇచ్చారు. గురువారం తిరుపతి అర్బన్ శెట్టిపల్లి గ్రామపంచాయతీ భూ బాధితుల భూముల ను ఆయన స్వయంగా భూమి మొత్తం తిరిగి పరిశీలించారు. సీపీఐ సీపీఎం నాయుకులు, కార్యకర్తలు, భూ బాధితులు పెద్ద సంఖ్యలో నారాయణ వెంట నడిచి సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. శెట్టిపల్లికి చెందిన రైతులు నిరుపేదలు చెందిన భూములు మీ అబ్బ సొత్తు లబ్ధిదారులకు పంచడానికి మీరెవరు ప్రభుత్వానికి ఏమి హక్కు ఉందని ఆయన మండిపడ్డారు. రెవెన్యూ పోలీసులు లబ్ధిదారులకు సహాయపడకుండా బినామీ దారులకు వత్తాసు పలుకుతూ కోట్లాది రూపాయలు దోచుకోవాలని పేదవాడి నోట్లో మట్టిపడుతున్నారని, పేదల రక్తం మాంసాలతో భక్షించవద్దని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు ల్యాండ్ పోలింగ్ పేరుతో 500 ఎకరాలు ప్రజా అవసరాల కోసం తీసుకొని వాటిని సక్రమంగా ఉపయోగించకుండా ఆయన అధికారంలో నుంచి తప్పుకుంటే ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి శెట్టిపల్లికి వచ్చి మీ భూములన్ని మీకే అప్పగిస్తాం అని మాట ఇచ్చి, నేడు మాట తప్పిన జగన్మోహన్ రెడ్డిగా నిలబడిపోయాడని, ఇక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యేల వాటా పంపకాలలో తేడాల వల్ల నిరుపేద భూహక్కు దారులు నిలువునా మోసపోతున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ భూమిని ఎమ్మెల్యేలు పంచుకొనే హక్కు ఎవరిచ్చారు అని ప్రశ్నించారు . ప్రతి పేదవాడు భూమిలో ఇల్లు నిర్మించుకుంటారని నిర్మించుకున్న ఇళ్లకు అవసరమైన మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల భూములు బలవంతంగా లాక్కొని వారికి న్యాయం చేయకుండా కాలయాపన చేయడం జగన్మోహన్ రెడ్డికి తగదని తక్షణమే సమస్యను పరిష్కరించే దిశగా ఎవరి స్థలాలలో వారు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని లేని పక్షంలో సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో మేమే దగ్గరుండి పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి శత్రువు అని అలాంటి బిజెపి పంచన చేరడం పవన్ కళ్యాణ్ కు మంచిది కాదని ఈ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని జనసేన టిడిపి కలిసి ఉంటే మంచిదని అలా కాకుండా మూడు కలవాలని అనుకుంటే అది మొదటికే మోసం జరుగుతుందన్నారు. పవన్ కళ్యాణ్ గట్టిగా కష్టపడుతున్నాడు గాని సరైన నిర్ణయం తీసుకోలేకపోతున్నాడని ఆయన పవన్ కళ్యాణ్ కు చురక అంటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాద్ రెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె రాధాకృష్ణ, జిల్లా విశ్వనాథ్, బి నదియా, ఉదయ్ కుమార్, బండి చలపతి, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఎన్డి రవి, ఎన్ శివా, కె వై రాజా, కె. పద్మనాభ రెడ్డి, సి హెచ్ శివ కుమార్, మోహన్ రెడ్డి , ఎంవియున్ మూర్తీ, జె.నాగరాజు, వై ఎస్ మణి, భూ బాధితుల సంఘం నాయుకులు క్రిష్ణ , దప్పు సూరి, రాధాకృష్ణ, భాదితులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 6: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, యువకులు బీఆర్ఎస్(ఃతీబ)లో చేరుతున్నారని రాష్ట్ర ఆబ్కారీ, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్ నగర్ రూరల్ మండలం పోతనపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో సబ్బండ వర్ణాలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శమని వెల్లడించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో సంతోష్, వెంకట్రాములు, చిన్న నరసింహులు, నర్సింలు, కృష్ణయ్య, అంజి, శివ, చిలుక నరసింహులు, ఆంజనేయులు, చెన్నప్ప, వందమంది యూత్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ఆంజనేయులు, మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, పాండురంగారెడ్డి, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ఖాదర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# దొంగలను జైల్లో వేసిన తర్వాత ఏ లీక్ లేదు.. సాఫీగా పది పరీక్షలు : మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి, ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి): దొంగల్ని అరెస్టు చేసి జైల్లో వేసిన తర్వాత ఇవాళ ఏ లీక్ లేదు.. పది పరీక్షలు సాఫీగా సాగుతున్నాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

సంగారెడ్డి జిల్లా ధన్‌సరి విల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు స్థాపించి పిల్లలకు మంచి చదువు చెప్పిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. చదువేలేమో మనం చెప్పిస్తుంటే.. బీజేపీ నేతలేమో పేపర్లు లీక్ చేస్తున్నారు.

మొన్న, నిన్న పేపర్లు లీక్ చేశారు. ఇవాళ దొంగల్ని అరెస్టు చేసి జైల్లో వేసిన తర్వాత ఇవాళ ఏ లీక్ లేదు. పది పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. ఎవరైతే పేపర్ లీక్ చేశారో వారిని పోలీసులు దొరికించు కున్నారు. ఆ తర్వాత వారిని జైల్లో వేశారు అని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు బీజేపీ నేతలు ఎన్నో కుట్రలు చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. హిందూ ? ముస్లిం గొడవలు పెట్టాలని చూశారు. అది సాధ్యం కాలేదు. తెలంగాణ గవర్నమెంట్‌ను పడగొట్టాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలను కొనేందుకు యత్నించారు. ఆ దొంగలు దొరికారు. అది కూడా ఫెయిలైంది.

అక్కడ కూడా ఫెయిల్ అయ్యామని చెప్పి మనకు పైసలు రాకుండా చేస్తున్నారు. బోర్లకాడ మీటర్లు పెట్టలేదని చెప్పి రూ. 30 వేల కోట్లు ఢిల్లీలో ఆపారు. నాణ్యమైన కరెంట్ కోసం నెలకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. సీఎం కేసీఆర్ రైతులకు పైసా ఖర్చు లేకుండా కరెంట్ ఇస్తున్నారు అని హరీశ్‌రావు తెలిపారు.

కాంగ్రెస్ నేతలు వస్తే మళ్లీ కాలిపోయే మోటార్లు వస్తాయి. పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి ఆగిపోతాయి. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా మన లాంటి పథకాలను అమలు చేయడం లేదు. రేవంత్ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. అయితే కూలగొడుతా.. లేదంటే కాలబెడుతా అని అడ్డగోలుగా మాట్లాడుతున్నాడు. వారి మాటలకు జనాలు గందరగోళం కావొద్దు. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించాలి. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలి అని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు

# మీడియా.. వినోద.. ప్రజావగాహన రంగంలో 'అమెజాన్ ఇండియా'తో కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ భాగస్వామ్య ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:మీడియా, వినోదం, ప్రజావగాహన రంగాల్లో 'అమెజాన్ ఇండియా'తో తమ శాఖ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నదని కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ ఇవాళ ప్రకటించారు. ఈ భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ప్రాచీన నాగరకతకు నిలయమైన భారతదేశంలో నేటికీ లక్షలాది గాథలను ప్రజలకు చేర్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కథల స్వరూప, స్వభావాలు కాలాతీతమైనవని మంత్రి అన్నారు. ఈ మేరకు ఆధ్యాత్మికత నుంచి సాఫ్ట్‌వేర్ దాకా; సంప్రదాయాల నుంచి పోకడల వరకూ; జానపద గాథల నుంచి పండుగల దాకా; గ్రామీణ భారతం నుంచి వికసిస్తున్న భారతం వరకూ విస్తృత పరిధిని కలిగి ఉన్నాయని శ్రీ అనురాగ్ ఠాకూర్ వివరించారు. భారతీయ కథా సారాంశం (కంటెంట్) ఇటీవల అంతర్జాతీయ వేదికలపైనా విజయ దుందుభి మోగించిందని, విదేశీ ప్రేక్షకులలోనూ భారత నటీనటులకు విశేష ఆదరణ లభించిందని మంత్రి గుర్తుచేశారు.

భారత శాండ్‌లో వినోద పరిశ్రమకు సానుకూల వాతావరణ సృష్టి దిశగా తమ మంత్రిత్వశాఖ చేపట్టిన చర్యల గురించి మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. భారత వినోద పరిశ్రమకుగల బలాలు-అవకాశాలను ప్రభుత్వం గుర్తిస్తుందని, ముఖ్యంగా- ఓటీటీల వంటి వేదికలకు గుర్తింపునిస్తుందని ప్రకటించారు. ఈ మేరకు దృశ్య-శ్రవణ సేవలను కీలకమైన సేవారంగంగా గుర్తించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇటీవలే ఓటీటీ కథాకథన నిర్వహణలో స్వీయ-నియంత్రణ చట్రాన్ని రూపొందించిందని గుర్తుచేశారు.

అమెజాన్ ఇండియాతో భాగస్వామ్యం అనేక విధాలుగా ఎంతో ప్రత్యేకమైదని శ్రీ ఠాకూర్ అన్నారు ఈ మేరకు సృజనాత్మక పరిశ్రమలోని వివిధ అంశాలకు ఈ ఒప్పందం పత్రం విస్తృత స్థాయిలో వర్తిస్తుందని పేర్కొన్నారు. 'ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' (ఎఫ్‌టిటిఐ), 'సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' సంస్థలలో కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఉపకార వేతనాలు, శిక్షణార్థి ఉద్యోగావకాశాలు, నిపుణులతో ప్రత్యేక బోధన, ఇతరత్రా అవకాశాలకు సంబంధించి నిబంధనల రూపకల్పన ద్వారా పరిశ్రమ-విద్యారంగాలను బలోపేతం చేయడంలో ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని ఆయన చెప్పారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి కోర్సులు పూర్తిచేసుకుని వచ్చే ప్రతిభావంతులైన కళాకారులకు అవకాశాల అన్వేషణ వ్యవధి తగ్గడానికీ ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు.

ఓటీటీ వేదికలలో కథాకథన చిత్రీకరణ నాణ్యతపై మంత్రి ఆందోళన వెలిబుచ్చారు. సృజనాత్మకత ముసుగులో అశ్లీలానికి, అసభ్య భాషకు తావివ్వరాదని మంత్రి సూచించారు. ఈ బాధ్యత పూర్తిగా ఆయా వేదికలదేనని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని వైవిధ్యభరిత సమష్టి తత్వాన్ని, ప్రజా చైతన్యాన్ని ఆ వేదికల కథాకథనాలు ప్రతిబింబించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీ వరుణ్ ధావన్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. స్ట్రీమింగ్ సేవలు ప్రజానీకంలోకి చొచ్చుకుపోతుండటాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ సేవల ద్వారా కథాకథన వైవిధ్యంతో నేడు భారతీయ సినిమా అనూహ్య స్థాయిలో ప్రపంచవ్యాప్తం అవుతున్నదని గుర్తుచేశారు. ఇన్నాళ్లూ మరుగునపడిన కళాకారుల ప్రతిభ ఇకపై అంతర్జాతీయ స్థాయికి చేరి, అవకాశాల సమతూకానికి తోడ్పడుతుందని శ్రీ ధావన్ నొక్కిచెప్పారు. ''ఇప్పటిదాకా అవకాశాలు కరువైన కొత్త నటీనటులు, సృజనాత్మక ప్రతిభావంతులు ఇకపై అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ కాగలరు" అని ఆయన వివరించారు.

భాగస్వామ్య ఒప్పందం గురించి శ్రీ ధావన్ మాట్లాడుతూ- "మన పరిశ్రమతోపాటు ప్రతిభను ప్రోత్సహించే, చేయూతనిచ్చే ఈ ఒప్పందం నాలో ఆశలు నింపింది. ప్రపంచ వినోద వేదికపై భారతీయుడిగా సగర్వంతో నిలవాలనే ఆశయానికి పునర్నిర్వచనం ఇవ్వడంలో మనమంతా సమష్టిగా కృషి చేయడానికి ఇది తోడ్పడుతుంది" అని వ్యాఖ్యానించారు.

కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర మాట్లాడుతూ- అమెజాన్ ఇండియాతో ఒప్పందం వల్ల భారతీయ కళాకారుల ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో అవకాశాలతోపాటు విశేష గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

అమెజాన్ ప్రైమ్ వీడియో ఆసియా పసిఫిక్ ప్రాంతీయ వైస్ ప్రెసిడెంట్ శ్రీ గౌరవ్ గాంధీ మాట్లాడుతూ- "పరిశ్రమ వృద్ధికి ఉత్తేజమివ్వడంలో భాగంగా ప్రతి సజీవ వేదికను, సమగ్రత సంబంధిత అన్ని మార్గాలను ఈ భాగస్వామ్యం సద్వినియోగం చేసుకోగలదని ఆశాభావంతో ఉన్నాం" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అమెజాన్ ఇండియా ప్రజావిధాన విభాగం వైస్ ప్రెసిడెంట్ శ్రీ చేతన్ కృష్ణస్వామి, సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ విక్రమ్ సహాయ్, ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

భాగస్వామ్యం ఒప్పందం స్వరూప-స్వభావాలు

అమెజాన్ సంస్థలోని వివిధ అనుబంధ విభాగాలు, మంత్రిత్వశాఖలోని పలు సంస్థల మధ్య బహుకోణీయ సహకారానికి ఈ భాగస్వామ్య ఒప్పంద పత్రం (ఎల్ఓఇ) తోడ్పడుతుంది. ఈ మేరకు ప్రభుత్వం వైపునుంచి- నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డిసి); ప్రసార భారతి; ప్రచురణ విభాగం; ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిఐఐ), సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఆర్ఎఫ్‌టిఐ)ల పరిధిలోని వివిధ మాధ్యమాల శిక్షణ సంస్థలు ఈ ఒప్పందం పరిధిలోకి వస్తాయి. అలాగే అమెజాన్ తరఫున- అమెజాన్ ప్రైమ్ వీడియో, అలెక్సా, అమెజాన్ మ్యూజిక్, అమెజాన్ ఇ-మార్కెట్ ప్లేస్, 'ఐఎండిబి' దీని పరిధిలో ఉంటాయి.

ప్రజావగాహన - భారత సాంస్కృతిక వారసత్వానికి ప్రాధాన్యం

అలాగే అమెజాన్ ఇ-కామర్స్ వెబ్‌సైట్‌లో భారతదేశ సంస్కృతి సంబంధిత ప్రచురణ విభాగం పుస్తకాల ప్రత్యేక జాబితా ద్వారా భారతీయ వారసత్వంతోపాటు అమెజాన్ మ్యూజిక్, అలెక్సాలో భారతీయ సంగీతానికి ప్రోత్సాహమివ్వడం కూడా ఈ ఒప్పందంలో భాగం చేయబడ్డాయి. అంతేకాకుండా గౌరవనీయులైన భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రుల ప్రసంగాలు, జాతీయ ప్రాధాన్యంగల కీలకాంశాలు ప్రజాహిత కార్యక్రమాల సమాచారం, రోజువారీ వార్తల బులెటిన్లు కూడా అలెక్సా, అమెజాన్ మ్యూజిక్ ద్వారా ప్రజలకు అందించబడతాయి.

భారతీయ ప్రతిభావంతులకు ప్రోత్సాహం

ప్రతిభకు పదును పెట్టడానికి సంబంధించి, అమెజాన్ ప్రైమ్ వీడియో (ఏపీవీ) ఉపకార వేతనాల ప్రాయోజిత సంస్థగా వ్యవహరిస్తుంది. శిక్షణార్థి ఉద్యోగి కార్యక్రమాలను రూపొందిస్తుంది. దీంతోపాటు 'ఎఫ్‌టిఐఐ, ఎస్ఆర్ఎఫ్‌టిఐ' విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. 'ఎన్ఎఫ్‌డిసి' భాగస్వామ్యంతో 'ఏపీవీ' నైపుణ్య కార్యక్రమాలను చేపడుతుంది. మీడియా, వినోద పరిశ్రమ కోసం విద్యా సంస్థలలో జాతీయ, అంతర్జాతీయ చలనచిత్ర ప్రముఖులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంది. అలాగే '75 మంది భవిష్యత్ సృజనాత్మక మేధావులు' కింద విజేతల ప్రతిభకు మెరుగులు దిద్దే కార్యకలాపాలను ప్రారంభిస్తుంది. మరోవైపు భారతీయ ప్రతిభకు ప్రపంచ గుర్తింపును పెంచే దిశగా సృజనాత్మక పరిశ్రమ కోసం అంతర్జాతీయ డేటాబేస్ అయిన 'ఐఎండిబి'లో భారతీయ కళాకారుల సమాచార విస్తృత లభ్యత కోసం 'ఎన్ఎఫ్‌డిసి'తో కలసి అమెజాన్ కృషిచేస్తుంది.

ప్రపంచ వేదికపై భారతీయ కథాకథన చిత్రీకరణకు ప్రాచుర్యం

మంత్రిత్వశాఖతో ఈ భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా-భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ సంస్థ (ఐఎఫ్ఎఫ్ఐ) అవార్డు పొందిన చలనచిత్రాలతోపాటు భారత్‌తో అంతర్జాతీయ సహ-నిర్మాణ ఒప్పందాల కింద నిర్మించిన చలనచిత్రాలను అమెజాన్ ప్రైమ్ వీడియోద్వారా ప్రపంచ ప్రేక్షకులకు అందుబాటులో ఉంచుతారు. భారత్ సాధించిన విజయాలను ప్రపంచానికి తెలిపే చలనచిత్రాలు, వెబ్-సిరీస్‌లు రూపొందించే అవకాశాలను కూడా 'ఏపీవీ' అన్వేషిస్తుంది. ప్రసార భారతి, 'ఎన్ఎఫ్‌డిసి'ల సుసంపన్న భాండాగారం నుంచి కథాకథనాలను ప్రపంచవ్యాప్త యువతకు అందుబాటులోకి తెచ్చే బాధ్యతను 'ఏపీవీ, మినిటీవీ' నిర్వర్తిస్తాయి. ప్రతిష్ఠాత్మక భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో, ప్రాంతీయ చలనచిత్రోత్సవాల్లో, కథాకథనాల సమర్పణ, సాంకేతిక ప్రదర్శనలు, సృజనాత్మకతపై కార్యశాలలు, పరస్పర ప్రతిభా ప్రదర్శన వగైరాల కోసం 'ఎన్ఎఫ్‌డిసి'తో అమెజాన్ సహకారం కొనసాగుతుంది.

# బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు : మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, ఏప్రిల్ 6: బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం లోని 17 వ వార్డు అంబేద్కర్ నగర్‌కు చెందిన మైనార్టీ నాయకులు ఖాదర్‌తో పాటు మరికొందరూ వార్డ్ కౌన్సిలర్ భరత్ మహజన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. మైనార్టీ నాయకులు మాట్లాడుతూ సొంత గూటికి చేరుకున్నందుకు తమకు ఆనందంగా ఉందని వెల్లడించారు. గతం లో అవగాహనరాహిత్యం తో పార్టీ వీడిన నేతలంతా మంత్రి జగదీశ్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి,సంక్షేమానికి ఆకర్షితులై తిరిగి బీఆర్ఎస్ లో చేరుతున్నామని వెల్లడించారు.

సూర్యాపేట లో ప్రత్యేకించి ముస్లింలకు షాదీఖానా, కబరిస్తాన్, కమ్యూనిటీ హాల్స్, పాత మసీదుల పునరుద్ధరణ వంటి అభివృద్ధి పనుల చేపట్టారని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ కీసర వేణు గోపాల్ రెడ్డి, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# తోటి పోలీసుల ముందే రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై ఆత్మహత్య

జనగామ, ఏప్రిల్ 6: తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా లో విషాదం చోటు చేసుకుంది. జనగామ ఎస్సైగా గత 8 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 55 ఏళ్ల కాసర్ల శ్రీనివాస్ భార్య రాత్రి బాత్రూం లో ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు శ్రీనివాస్ ను పరామర్శించేందుకు వెళ్లారు. పోలీసులు అందరూ ఉండగానే శ్రీనివాస్ గన్ తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు.గత కొన్నాళ్లుగా ఎస్సై శ్రీనివాస్ మరియు ఆయన భార్య స్వరూపకు గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరు కుమారులు కూడా హైదరాబాద్ లో ఉంటూ ఉద్యోగం చేసుకుంటూ ఉన్నారు. ఒంటరిగా ఉంటున్న శ్రీని వాస్ మరియు స్వరూపలు గొడవలు పడుతూ ఉన్నారట. రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది.ఉదయం లేచి వరకు స్వరూప బాత్రూం లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. తోటి పోలీసులు పరా మర్శించేందుకు వచ్చిన సమయంలో శ్రీనివాస్ కన్నీరు మున్నీరు అయ్యాడు. తన భార్య మరణం తీరని లోటు అంటే పరామర్శించేందుకు వచ్చిన సీఐ.. ఏసీపీ ముందు కన్నీరు పెట్టుకున్నాడు. ఇంట్లో సీఐ.. ఏసీపీ మరియు ఇతర తోటి పోలీసులు ఉండగానే శ్రీనివాస్ బాత్రూంకు అని వెళ్లాడు. వెంట రివాల్వర్ తీసుకుని వెళ్లి.. కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనివాస్ దంపతుల కుమారులకు సమాచారం ఇచ్చినట్లుగా పేర్కొన్నారు.

# శోభాయాత్రతో ఆధ్యాత్మిక వైభవం : ఎమ్మెల్యే గణేష్ బిగాల



నిజామాబాద్, ఏప్రిల్ 6: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రతో.. ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుందని అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల అన్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కంఠేశ్వర్ వద్ద హనుమాన్ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి వీర హనుమాన్ విజయయాత్రలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. వీర హనుమాన్ విజయయాత్ర ఆధ్యాత్మికంగా శాంతియుతంగా నిర్వహించేందుకు మున్సిపల్, పోలీస్, ఆరోగ్య శాఖ, ఎలక్ట్రిసిటీ అధికారులని సమన్వయం చేస్తూ ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లు కల్పించారని పేర్కొన్నారు. వీర హనుమాన్ విజయ యాత్రలో పాల్గొనే భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంచినీరు, పండ్లు, అల్పాహారం ఏర్పాటు చేశామని తెలిపారు. శోభాయాత్రలో పాల్గొన్న 5000 హనుమాన్ భక్తులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అర్బన్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం మంచి నీరు, పండ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరే టర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా చాంపూలాల్ జాతర

## -సాంప్రదాయ బద్దంగా డప్పు కొట్టి ప్రారంభించిన మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గులాబీ జెండా నీడలో గిరిజన తాండాలు శోభయామానంగా మారాయని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు .ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో గిరిజన తాండాలన్ని గ్రామ పంచాయతీలుగా ఆవిష్కృతమయ్యా అని ఆయన తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని చివ్వేంల మండలం బడితండా లో గిరిజనులు అత్యంత ప్రాశస్త్యంగా కొలుచుకునే చాంపూలాల్ జాతరను గిరిజనుల సాంప్రదాయాన్నినుసరించి ప్రత్యేక పూజలు నిర్వహించి వారి ఆచారం ప్రకారం డప్పులు మ్రోగించి ప్రారంభించారు.

అనంతరం మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో గిరిజన అవాసాలను అభివృద్ధి పరచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దని ఆయన కొనియాడారు. 2014 కు ముందు 2014 కు తరువాత అన్నది ఒక్కసారి పరికించి చుస్తే జరిగిన పురోగతి ఇట్టే బోధ పడుతుందన్నారు. అంతర్గత రహదారులతో గిరిజన తండాలు కళకళ లాడుతున్నాయని అందుకు కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత యే కారణమన్నారు. మిషన్ భగీరథ తో గిరిజన తాండాలలో మంచి నీటి ఎద్దడిని నివారించిన ప్రభుత్వం గిరిజన విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లేందుకు వీలుగా 20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మునుముందు మరింత అభివృద్ధికి గిరిజనులు ముఖ్యమంత్రి కేసీఆర్ కు తోడ్పాటు నందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గులాబీ జెండాయే గిరిజన తాండాలకు నీడ నిస్తుందని ఆ నీడ చాటున యావత్ గిరిజన సమాజం మరింత పురోగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అందుకు గిరిజనుల ఆరాధ్య దైవం చాంపూ లాల్ ఆశీస్సులు బలంగా ఉండాలని ప్రార్థించినట్లు మంత్రి జగదీష్ రెడ్డి వెల్లడించారు.

# మహాత్మ జ్యోతిబాపూలే జయంతోత్సవాన్ని విజయవంతం చేయాలి!

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, ఏప్రిల్ 06 (నేటి నిజం ప్రతినిధి) ఈనెల 11న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జ్యోతిబాపూలే జయంతోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం నాడు ఒక ప్రకటనలో కోరారు.

మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని పురస్కరించుకుని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈనెల 11న ఆర్ అండ్ బి ఆఫీస్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి ఉదయం 9 గంటలకు పుష్పమాలంకరణ గావించి, అనంతర నటరాజ్ థియేటర్ పక్కన కల్వకుంట రోడ్డులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇట్టి కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వివిధ సంఘాల నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

0ఇట్టి జయంతోత్సవంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు, అధికారులు ,ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం, బలగం : మంత్రి గంగుల



కరీంనగర్, ఏప్రిల్ 6: సీఎం కేసీఆర్ నేతృత్వంలో సాధించిన తెలంగాణ ప్రగతి పథంలో దూసుకుపోతుందని, బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం, బలగమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఉండే అధిష్టానం తెలంగాణ బాగోగులు చూడదని, గల్లీలో ఉన్నవాళ్లే బాగోగులు చూస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేని ఢిల్లీ పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తలాపున గోదావరిని, తెలంగాణకు కాంతిలి స్తున్న ఎన్టీపీసీని కాపాడుకోవాలంటే సీఎం కేసీఆర్‌ను మరోసారి నిండుమనుసుతో దీవించాలని కోరారు. కరీంనగర్‌కు సినీ ఇండస్ట్రీ తరలివస్తుందని, మెడికల్ కాలేజీ, వెంకటేశ్వర టెంపుల్, సెంటర్ల బ్యూటిఫికేషన్, కేబుల్ బ్రిడ్జి, మానేర్ రివర్‌తో నగరాన్ని అభివృద్ధి చేసుకున్నామని వెల్లడించారు. గత 75 సంవత్సరాలల్లో ఎన్ని ప్రభుత్వాలు మారినా సాగునీరు, తాగునీరు, గ్రామాలకు రోడ్లుకూడా లేవని, సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో ప్రతీ సమస్య సమసిపోతుందని అన్నారు. 24 గంటల ఉచిత కరెంటు, పింఛన్లు, లక్షలాది ఉపాధి అవకాశాలతో తరలొస్తున్న పరిశ్రమలతో తెలంగాణ అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుందని వెల్లడించారు.

అభివృద్ధిని ఓర్వలేని వ్యక్తులు పాదయాత్రల పేరుతో ఆంధ్రా నుంచి ఒకరు, ఓటుకు నోటు కేసులో వ్యక్తి ఒకరు, పేపర్ లీకేజీ మనిషి మరొకరు దండయాత్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. వీరికి తెలంగాణపై ప్రేమలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డ వేణి మధు, జడ్పీటీసీ పిట్టల కరుణ రవీందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మంత్రి పువ్వాడను కలిసిన ఖమ్మం బార్ అసోసియేషన్ నూతన కమిటి

## – నూతన కమిటీని శాలువాకప్పి సత్కరించిన మంత్రి పువ్వాడ



ఖమ్మం,ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షుడు మాదిరాజు, ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ట్రెజరర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ విజయ రాఘవ, స్పోర్ట్స్ సెక్రటరీ రావుల వెంకట్, లేడీ రిప్రజెంటేటివ్ కేవీపీ లక్ష్మి, ఈసీ మెంబర్ సింగం జనార్ధన్ లను శాలువాతో సత్కరించారు. ఖమ్మం లీగల్ సెల్ అద్భుతంగా పనిచేస్తుందని, బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ఏ ఉద్యమమైనా ముందుండి నడిపించేది లీగల్ సెల్ విభాగమని పేర్కొన్నారు.

ఇదే స్ఫూర్తితో ప్రత్యర్థులు ఎవరైనా వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని ,తొండి మాటలకు, తొండి చేష్టలను ఎదుర్కొని వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ని గెలిపించుకుని ప్రత్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని సూచించారు. అనంతరం న్యాయ వాదులు బిఆర్ఎస్ లీగల్ సెల్ లో చేరారు. వారికి మంత్రి పువ్వాడ బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో దిరిశాల కృష్ణారావు, మన్నేపల్లి బసవయ్య, మేకల సుగుణ రావు, రావుల వెంకట్, కొత్తవెంకటేశ్వరరావు, బిచ్చల తిరుమలరావు, వనమ్ములేటి శ్రీనివాస్, పొట్ల శ్రీకాంత్, బెల్లం ప్రతాప్, ఇర్షాద్, ఇమ్మడి లక్ష్మి నారాయణ, సింగం జనార్దన్ గౌడ్, బత్తుల బసవపున్నయ్య తదితరులు ఉన్నారు.

# జీతాలు పెరగటం కాదు... ఒకటో తేదీన జీతం పడితే చాలు

అమరావతి ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జీతాలు పెరిగితే సంతోషపడే పరిస్థితుల నుంచి నేడు ఒకటో తేదీన జీతం పడితే చాలనే పరిస్థితికి ఉద్యోగులు వచ్చారని ఏపీ అమరావతి జేఏసీ ఉద్యోగ సంఘాల నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు హాట్ కామెంట్స్ చేశారు. మార్చి 9 తమ సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూపలుకూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో ఎందుకు జీతాలు ఇవ్వలేకపోతోంది? అని నిలదీశారు. సమయానికి వాయిదాలు కట్టకపోవడంతో బ్యాంకులు జరిమానా విధిస్తున్నాయన్నారు. అప్పు కూడా పుట్టని పరిస్థితుల్లో లోన్ యాప్ల నుంచి డబ్బులు తీసుకుని సకాలంలో చెల్లించలేక ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన 10వ పీఆర్సీ పేస్కేళ్లే ఇంకా అమలులో ఉన్నాయని బొప్పరాజు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ సంఘాల నేతలతో విజయవాడలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు హాట్ కామెంట్స్ చేశారు. 11వ పీఆర్సీలో సిఫార్సు చేసినవి ఎప్పుడు అమలు చేస్తారు?' అని ప్రశ్నించారు. నెలనెలా ఉద్యోగులు పింఛనర్ల కోసం రూ. 90000 కోట్ల వరకు వెచ్చిస్తున్నామంటూ చెబుతున్నారని వాస్తవానికి తమ కోసం వెచ్చిస్తున్నది రూ. 74000 కోట్లే అని షాకింగ్ కామెంట్స్ చేశారు. వాలంటీర్లు కన్సల్టెంట్లు సలహాదారులకు ఇస్తున్న వేతనాలతో కలిపి రూ. 90000 కోట్లు అంటూ తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన ప్రయోజనాలు జీతభత్యాలు ఎరియర్స్ డీఏలు పెండింగ్ బకాయిలు తదితర వాటిపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు సమర శంఖం పూరిస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏపీ జేఏసీ అమరావతి ఉద్యోగుల సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 8 నుంచి మలిదశ ఉద్యమానికి సిద్ధం శ్రీకారం చుడుతున్నట్టు వెల్లడించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 8 నుంచి ఏప్రిల్ 29 వరకు వివిధ కార్యక్రమాలను చేపడతారు.

# వన్ టౌన్ సీఐగా టి.స్వామి బాధ్యతల స్వీకరణ



ఖమ్మం,ఏప్రిల్ 6:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మంవన్ టౌన్ సిఐగాటి.స్వామి గురువారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల వెలువడిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల నేపథ్యంలో టి.స్వామి గురువారం భాధ్యతలు స్వీకరించారు.

# ఏప్రిల్ 11న జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం .

సంగారెడ్డి, ఏప్రిల్ 06 (నేటి నిజం ప్రతినిధి) జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 11న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్.ఎల్లయ్య గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఏప్రిల్ 11న ఉదయం 11 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అధ్యక్షతన జెడ్పి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా అధికారులు తమ,తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

గౌరవ సభ్యులందరూ నిర్ణీత సమయంలోపు సమావేశానికి హాజరు కావాలని జెడ్పి సీఈవో కోరారు.

# అమ్మకానికి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం

న్యూ డిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడమే లక్ష్యంగా అడుగులు ముందుకేస్తున్న కేంద్ర ప్రభుత్వం దృష్టి ఇప్పుడు విమానాశ్రయాలపై పడింది. ఏటా రూ.200 కోట్లపైనే లాభాలు ఆర్జిస్తున్న తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేంద్రం తాజాగా అమ్మకానికి పెట్టింది. ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి విమానాశ్రయానికి రద్దీ ఎక్కువ. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి దేశ విదేశాల నుంచి ఇక్కడకు పర్యాటకులు వస్తుంటారు. దీంతో సహజంగానే తిరుపతి విమానాశ్రయానికి వచ్చే ఆదాయం కూడా ఎక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో మరిన్ని వసతులు కల్పించి అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దాల్సిన కేంద్రం అమ్మకానికి పెట్టడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఒక్క తిరుపతి విమానాశ్రయమే కాకుండా ఏపీలో విజయవాడ (గన్నవరం) రాజమండ్రి విమానాశ్రయాలను కూడా కేంద్రం ప్రైవేటీకరించనుంది. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి తాజాగా వెల్లడించారు. ముఖ్యంగా తిరుపతి విమానాశ్రయానికి కనీసం టెండర్లను కూడా పిలవకుండానే విక్రయించడానికి కేంద్రం సిద్ధమైందని సమాచారం. భారీ స్థాయిలో దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్న తిరుపతి ఎయిర్ పోర్టును దక్కించుకొనేందుకు జీఎంఆర్ టాటా రిలయన్స్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడింటిలో రిలయన్స్ వైపే కేంద్ర ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఈ విమానాశ్రయాన్ని కారు చౌకగా దక్కించుకొని దీనిపక్కనే ఉన్న మరో 300 ఎకరాల ప్రభుత్వ భూములను కూడా దక్కించుకోవాలనే ప్రయత్నాలు రిలయన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మూడు వందల ఎకరాల్లో మాల్స్ రెస్టారెంట్లు స్టార్ హోటళ్లు నిర్మించే ప్రణాళికల్లో రిలయన్స్ ఉందని తెలుస్తోంది. సాధారణ రోజుల్లో రెండు వేలు వేసవి నాలుగు నెలల కాలంలో రోజుకు మూడు వేల మంది ప్రయాణికులు వస్తున్నారు. తాజాగా అంతర్జాతీయ విమానాలను తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కువైట్ నుంచి తిరుపతికి విమానాలు నడపడానికి ప్రణాళిక సిద్ధమైంది. ఇంతలోనే కేంద్రం అమ్మకానికి పెట్టడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తిరుపతి విమానాశ్రయంలో ఒకేసారి మూడు విమానాలు ల్యాండ్ అవ్వడానికి అవకాశం ఉంది. కేవలం ప్రయాణికులే విమానాలే కాకుండా కార్గో విమానాలు సైతం రాకపోకలు సాగించేలా విమానాశ్రయాన్ని తీర్చిదిద్దారు. 550 కార్లను పార్కింగ్ చేయగల సామర్థ్యం ఉంది. కొంతమంది పారిశ్రామికవేత్తల సినీతారల వ్యక్తిగత ప్రత్యేక విమానాలు హెలికాప్టర్లు ఇక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ఆదాయం కూడా ఈ ఎయిర్ పోర్టుకు పెద్ద ఎత్తున లభిస్తోంది. దీంతో కార్పొరేట్ కంపెనీల కన్ను ఈ విమానాశ్రయాన్ని దక్కించుకోవడంపై పడ్డాయి. తిరుపతి విమానాశ్రయానికి ప్రస్తుతం ఢిల్లీ విశాఖపట్నం విజయవాడ చెన్నై బెంగళూరు మైసూరు హైదరాబాద్ ల నుంచి రోజుకు 15 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అందులో ఇండిగో ఐదు ఎయిరిండియా నాలుగు స్పైస్ జెట్ ఐదు ఇండియన్ ఎయిర్లైన్స్ ఒకటి ఉన్నాయి. సిబ్బంది జీతభత్యాలు నిర్వహణ మొత్తం ఖర్చులుపోను గత ఐదేళ్లగా ఏటా సుమారు రూ.200 కోట్లు చొప్పున లాభాలు వస్తున్నాయి. 2021?22 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 623341 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. 8150 ట్రిప్పులు విమానాలు తిరిగాయి. అలాగే 83 కార్గో విమానాలు వివిధ ఉత్పత్తులను ఎగుమతి చేశాయి.

# ఏపీ ప్రభుత్వం దుబారా.. నిధుల మళ్లింపుపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం

## చేసిన తప్పుకు పరిహారంగా రూ.40 కోట్లను వడ్డీ కింద చెల్లించాలని ఆదేశం

న్యూ డిల్లీ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఏపీ ప్రభుత్వం దుబారా.. నిధుల మళ్లింపుపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వైద్య ఆరోగ్య శాఖకు ఖర్చు చేయాలంటూ.. 2021-22లో ఇచ్చిన 489.8 కోట్ల రూపాయలను ఇతర అవసరాలకు మళ్లించడంపై నిప్పులు చెరిగింది. చేసిన తప్పుకు పరిహారంగా రూ.40 కోట్లను వడ్డీ కింద చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ మొత్తాన్ని చెల్లిస్తేనే.. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మలివిడత నిధులను విడుదల చేస్తామని తేల్చి చెప్పింది.

15వ ఆర్థిక సంఘం ద్వారా 2021-22లో రూ.489.8 కోట్లు 2022-23లో రూ.489.8 కోట్లు 2023-24లో రూ.514.14 కోట్లు 2024-25లో రూ.540.18 కోట్లు రూ.2025-26లో రూ.567.4 కోట్ల చొప్పున కలిపి మొత్తం 2601.32 కోట్లను రాష్ట్రానికి కేటాయిస్తామని కేంద్రం తెలిపింది.

ఈ మొత్తం నిధులతో ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాల భవనాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉప పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే.. 2021-22 సంబంధించిన నిధులను రూ. 489 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినా.. ఇతర అవసరాలకు మళ్లించేసింది. వాటిని ఆరోగ్య శాఖకు సర్దుబాటు చేయలేకపోయింది. కేంద్ర నుంచి ఒత్తిడి పెరగడంతో 2022 జులైలో రూ. 102 కోట్లు మిగిలిన మొత్తాన్ని ఈ ఏడాది మార్చి రెండో వారంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు పంపింది. నిధులు బదలాయింపులో రాష్ట్ర ఆర్థిక శాఖ తీరు పట్ల కేంద్రం ఆగ్రహాన్ని వ్యక్తంచేసింది.

జరిగిన తీవ్ర జాప్యానికి.. 7% వడ్డీ చొప్పున లెక్కలు వేసి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 కోట్లు చెల్లించాలని ఇటీవల రాష్ట్ర ఆర్థిక శాఖకు తాఖీదు పంపింది.

ఈ మొత్తాన్ని చెల్లిస్తేనే.. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ. 489.8 కోట్లను విడుదల చేస్తామని స్పష్టంచేసింది. వచ్చిన నిధులను వచ్చినట్లు.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు బదలాయిస్తే.. ఈ వడ్డీ చెల్లింపు ఆదేశాలు వచ్చేవికావు. ఈ నిధులను వాడడానికి వీల్లేదని అధికారులు చెప్పినా.. ఆర్థిక శాఖ పట్టించుకోలేదు. ఫలితంగా కేంద్రం కన్నెర్రతోపాటు.. 40 కోట్లు వడ్డీ కూడా కట్టే పరిస్థితి వచ్చింది.

# రెండవ విడత గొర్రెల పంపిణి కార్యక్రమం విజయవంతానికి సహకరించవలసినది

మెదక్, ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి):రెండవ విడత గొర్రెల పంపిణి కార్యక్రమం విజయవంతానికి సహకరించవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరారు.

గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి గొర్రెల పంపిణి పథకం-పేజ్-2 (రాఖీఆఖ) అమలు పై మండల ప్రత్యేకాధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులు, గొల్ల, కురుమ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రెండవ విడత గొర్రెల పంపిణి పథకం అమలుపై రాష్ట్రప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలను వివరిస్తూ, నిబంధనల మేరకు లబ్దిదారులకు నాణ్యమైన గొర్రెలు, పొట్టేలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మొదటి విడతలో పేరు నమోదయి తమ వాటా ధనం 25 శాతం చెల్లించని లబ్దిదారులు వర్చువల్ ఐ.డి. ద్వారా నేరుగా జిల్లా కలెక్టర్ ఖాతాకు బదిలీ చేయాలని సూచించారు. త్వరలో మండల, నియోజక వర్గ స్థాయిలో మండల ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమై ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలపై అవగాహన కలిగిస్తామని అన్నారు. ఒక లక్ష డెబ్బై ఐదు వేల విలువ గల ఒక యూనిట్ లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు లబ్దిదారునికి అందించుటకు వీలుగా మండల ప్రత్యేకాధికారులు, టీమ్ తో కలిసి ఇతర రాష్ట్రాల నుండి నాణ్యమైన వాటిని కొనుగోలుచేసి పంపిణీ చేయుటకు చర్యలు తీసుకుంటారని అన్నారు.

# మంత్రి పువ్వాడను కలిసిన ట్రైనీ ఐపీఎస్ అవినాష్ కుమార్

ఖమ్మం,ఏప్రిల్ 6: (నేటి నిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లాకు కేటాయించిన ఐపీఎస్ ట్రైనీ ఆఫీసర్ అవినాష్ కుమార్ గురువారం రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని తన క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. శిక్షణ సమయంలో క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు, వారికి అందించాల్సిన న్యాయం సకాలంలో జరిగేలా చూడాలని కోరారు. వారి వెంట నగర ఏసీపీ పీ.వీ గణేష్ ఉన్నారు.

# నా చావుకోసం ఎదురుచూస్తున్నారు..

## -బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంచలన కామెంట్స్

హైదరాబాద్ ఏప్రిల్ 6 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బీఆర్ఎస్ పార్టీలో మరో ఎమ్మెల్యే బరెస్ట్ అయ్యారు. తన అసంతృప్తిని అసమ్మతిని బయటపెట్టారు. బీఆర్ఎస్ పార్టీలో ఇంటి దొంగలు ఉన్నారంటూ సంచలన కామెంట్స్ చేశారు. కొందరైతే నా చావు కోసం ఎదురుచూస్తున్నారంటూ బాంబు పేల్చారు. ఆయన ఎవరో కాదు డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లిలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు పార్టీ పేరు చెప్పుకొని రూ. లక్షలు సంపాదిస్తున్నారని.. అలాంటి వారిని గుర్తు పెట్టుకోవాలని రెడ్యానాయక్ తెలిపారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకూ పోరాటమే చేస్తున్నానని.. ప్రజల ఆశీర్వాదంతోనే గెలుస్తున్నానని అన్నారు. తనను కాదని.. గతంలో వేరే వారికి అవకాశం ఇస్తే వారు నియోజకవర్గంలో ఒక్క బోరు వేసి ఒక్క ఊరు తిగిని దాఖలాలు లేవన్నారు. తన వనితనానికి నియోజకవర్గ అభివృద్ధే నిదర్శనమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఎంపీపీ గగులోతు పద్మ రవినాయక్ కు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ మాలోతు కవిత నాయకులు పురాణం సతీష్ రవిచంద్ర తోట లాలయ్య బజ్జూరి పిచ్చిరెడ్డి ఎర్రం రెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో నా ఓటమి కోసం ఆమె వర్గీయులు కచ్చితంగా ప్రయత్నాలు చేస్తారని మంత్రి సత్యవతి రాథోడ్ ను ఉద్దేశించి రెడ్యా నాయక్ ఆరోపించినట్టుగా నియోజకవర్గంలో రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది... గతంలో సత్యవతి రాథోడ్ మీద ఎలాంటి వ్యాఖ్యలు చేయని రెడ్డి నాయక్. ఈమధ్య ఆమె పేరు ప్రస్తావించకుండా ఆమె వర్గాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతున్న మాటలు భారత రాష్ట్ర సమితిలో ఉన్న వర్గ పోరును తెరపైకి తీసుకొస్తున్నాయి.. అయితే ఈసారి డోర్నకల్ టికెట్ సత్యవతి రాథోడ్ కు ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రెడ్యానాయక్ ఈ వ్యాఖ్యలు చేస్తుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించండి

మెదక్, ఏప్రిల్ 6: (నేటినిజం ప్రతినిధి):18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించి శిబిరాలకు వచ్చేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య సిబ్బందికి అన్నారు. గురువారం హవేళిఘనాపూర్ మండలం మద్దులవాయి లో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసుకుంటున్న వారిని పరామర్శించి పరీక్షలు చక్కాగా చేస్తున్నారా, కంటి అద్దాలు నాణ్యతగా ఉన్నాయా, అద్దాలు పెట్టుకుంటే చూపు సరిగ్గా కనిపిస్తున్నదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నందున కంటి సమస్యలతో బాధపడుతున్న ఉన్న వారందరు ఇట్టి శిబిరాలలో కంటి పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు. కంటి చూపుకు సరిపోయే రీడింగ్ అద్దాలను అప్పటికప్పుడే ఇవ్వడం జరుగుతుందని, ప్రిస్క్రిప్షన్ అద్దాలను పక్షం రోజులలో ఆశా కార్యకర్తలు ఇంటికే తెచ్చిస్తారని అన్నారు. జూన్ 15 వరకు కొనసాగు కంటి వెలుగు శిబిరాలకు అత్యధిక సంఖ్యలో ప్రజలు వినియోగించుకునేలా గ్రామాలలో అవగాహన కలిగించి, ప్రతి రోజు కనీసం 150 మందికి పైగా స్క్రీనింగ్ చేసేలా ఆశా కార్యకర్తలు, ఏ.యెన్.ఏం. లు, మహిళా సంఘ సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 290 గ్రామా పంచాయతీలు, 51 మునిసిపల్ వార్డులలో కంటి వెలుగు శిబిరాలు విజయవంతంగా నిర్వహించి 2,91,336 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని ప్రస్తుతం 29 గ్రామ పంచాయతీలు,3 వార్డులలో కార్యక్రమం కొనసాగుతున్నదని అన్నారు. కంటి పరీక్షలు చేసుకున్న వారిలో 40 ఏళ్ళు పైబడిన వారికి 28,540 రీడింగ్ అద్దాలను, ఆ లోపు వారికి 4,880 అద్దాలను పంపిణి చేశామని కలెక్టర్ వివరించారు. అదేవిధంగా 33,395 మంది ప్రిస్క్రిప్షన్ అద్దాలకు రెఫెర్ చేసి 24,168 మందికి కళ్ళ జోళ్ళు అందించామని, మరో 9,227 మందికి త్వరలో ఆశా కార్యకర్తల ద్వారా అందజేస్తామని అన్నారు. కాగా కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో 2,24,488 మందికి ఎలాంటి సమస్యలు లేని నిర్ధారణ అయ్యిందని కలెక్టర్ వివరించారు.

